● దువ్వూరు, పోరుమామిళ్లలో రేషన్ దందా ● టీడీపీ, వైసీపీ నాయకుల పాత్ర..!

● అధినాయకుల పేర్లు వాడుకుంటూ జోరుగా వ్యాపారం


● అడ్డొస్తే తాటతీస్తామంటూ బెదిరింపు

● అక్రమ సంపాదనకు బరితెగింపు

పేదల బియ్యం..

పెద్దల భోజ్యం..!

పేదల బియ్యం.. పెద్దలకు కల్పతరువుగా మారింది. జిల్లాలో పలుచోట్ల రేషన్ దందా జోరుగా సాగుతోంది. ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా అందించే బియ్యాన్ని రేషన్ మాఫియా తక్కువ ధరకు కొనుగోలు చేసి అనుకూలంగా ఉన్న మిల్లర్లలో పాలిష్ పట్టించి ప్యాకింగ్ చేస్తున్నారు. వీటిని ప్రత్యేకంగా గోడౌన్లలో, ఎస్టేట్‌లలో నిల్వ ఉంచి అనుకూల సమయాల్లో బయటి ప్రాంతాలకు అక్రమంగా తరలించేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఎవరైనా అడ్డొస్తే రాజకీయ నాయకుల పేర్లు వాడుకుంటూ మూడు పువ్వులు.. ఆరు కాయలుగా అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారు. దువ్వూరు, పోరుమామిళ్ల, రాజుపాళెం, ప్రొద్దుటూరు, కమలాపురంలో ఈ మాఫియా బరితెగిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ దందాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.



ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులో చోటా, మోటా నాయకుల దందాలు అధికమయ్యాయి. ఈ తరహాలో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. నియోజకవర్గ అధినాయకుని పేరు ఈ అక్రమార్కులు వాడుకుంటూ అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారు. అధికార పార్టీ నాయకులే కాకుండా, వైసీపీ నాయకులతో కుమ్మక్కై, పేదలకు అందాల్సిన బియ్యాన్ని అక్రమార్జనకు వనరుగా వినియోగించుకుంటున్నారు. దువ్వూరు మండలంతో పాటు రాజుపాళెం, ప్రొద్దుటూరు, కమలాపురం మండలాల్లో వీరు డీలర్ల వద్ద నుంచి బియ్యాన్ని సేకరిస్తున్నారు.

మండలానికి చెందిన నేలటూరు, సంజీవరెడ్డిపల్లె, దువ్వూరు గ్రామాలకు చెందిన చోటా నాయకులు వాహనాల్లో లోడులకొద్దీ రేషన్‌బియ్యం ప్రతినెల సేకరించి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. 'గి' అనే అక్షరంతో ప్రారంభమయ్యే ఇతని హవా పక్క నియోజకవర్గాల్లో సైతం పాకింది. కొద్దిరోజులు దువ్వూరులో బహిరంగంగానే నోట్ల కట్టలు పట్టుకుని చీకటి సమయంలో ఇతని వద్దకు వచ్చి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసిన సందర్భాలు ఉన్నాయి. దువ్వూరు సమీపంలో ఒక ఎస్టేట్‌లో బాడుగకు ఇళ్లు తీసుకుని బియ్యాన్ని పెద్ద మొత్తంలో అందులో నిల్వ ఉంచేవాడు. ఇతని విచ్చలవిడితనానికి అదుపు లేకుండా పోవడంతో నియోజకవర్గంలోని ఒక పోలీసు అధికారి ఇతన్ని, ఇతని అనుచరులను అదుపులోకి తీసుకుని లాఠీకి పనిచెప్పారు. అక్రమార్జనకు అలవాటు పడిన సదరు చోటా నాయకుడు, అతని అనుచరులు మాత్రం వ్యాపారాన్ని వదలకుండా మకాం మార్చేశారు. రాజుపాళెం, ప్రొద్దుటూరు, కమలాపురం ప్రాంతాలకు కూడా తన సామ్రాజ్యాన్ని విస్తరింపజేశాడు.

దువ్వూరు మండలంలోని 'శ్రీ' అనే అక్షరంతో ప్రారంభమయ్యే ఓ వైసీపీ నాయకుడితో చేతులు కలిపాడు. వైసీపీ పాలనలో ఈయన వ్యాపారంలో రెండు చేతులా సంపాదించాడు. అప్పట్లో కర్నూలు జిల్లాలో సైతం పాగా వేశాడు. టీడీపీ అధికారంలోకి రావడంతో అతని అక్రమ వ్యాపారానికి తాత్కాలికంగా బ్రేక్ పడినా తిరిగి ప్రారంభించాడు. ఈ వ్యక్తి గెట్‌టు గెదర్ నిర్వహించి వ్యాపారులందరినీ సిండికేట్ చేశాడు. ఈ అక్రమ బియ్యం వ్యాపారం 'గి, శ్రీ' అనే వ్యక్తులతో పాటు అడపా దడపా అక్రమ బియ్యం సేకరించే మరో నలుగురు సైతం వ్యాపారంలో దూసుకుపోతున్నారు. వీరు పలుమార్లు బియ్యాన్ని తరలిస్తూ ప్రొద్దుటూరు, దువ్వూరులలో పోలీసులకు చిక్కిన సంఘటనలూ ఉన్నాయి. వీరందరూ అధికార పార్టీలో కొనసాగే ఓ మోస్తరు నాయకులను ఆశ్రయించి రాజకీయం అండగా ఉందనే మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. దువ్వూరు మండలంలో 37 చౌకదుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 120 టన్నుల బియ్యం దాకా ప్రతినెల ఆయా షాపులకు చేరుతుంది. వెంటనే రేషన్ మాఫియా వాటిని సేకరించి అక్రమ రవాణా చేస్తున్నారు. రెవెన్యూ, పోలీసు శాఖ వీటిపై దృష్టి సారిస్తే అక్రమాలకు బ్రేకు పడుతుందని పలువురు పేర్కొంటున్నారు.



తహసీల్దారు ఏమన్నారంటే..

రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. అయితే ఆ వ్యక్తులు ఎవరనేది తెలియడం లేదు. అక్రమంగా రేషన్ తరలిస్తున్న వారిపై నిఘా ఉంచాం. డీలర్లతో సమావేశం పెట్టుకుని ప్రజా పంపిణీ వ్యవస్థలో లోపాలు లేకుండా వారికి సూచిస్తాం. అక్రమ బియ్యం వ్యాపారం చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- అక్బల్‌బాషా, తహసీల్దారు

అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యం

● రేషన్ మాఫియాకు అడ్డుకట్ట పడేదెన్నడు?

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేద ప్రజల కోసం ఉచితంగా అందించే బియ్యాన్ని రేషన్ మాఫియా అక్రమ రవాణా చేస్తూ నిరాటంకంగా వ్యాపారాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి రేషన్ పంపిణీ ఒక వైపు జరుగుతుండగా మరో వైపు లబ్ధిదారుల నుంచి కొంద రు దళారులు కిలో రూ.17 వంతున కొనుగోలు చేస్తూ వాటిని పాలిష్ పట్టించి రూ.32 వంతున అమ్మకాలు చేస్తున్నారు. బియ్యం ప్యాకింగ్ చేస్తూ అక్రమ రవాణా చేస్తూ లావాదేవీలు కొనసాగిస్తున్నా రు. పోరుమామిళ్ల మండలంలో 34 రేషన్‌షాపులు ఉండగా దాదాపు పదివేల కార్డులు ఉంటాయనేది అంచనా. కొందరు డీలర్లు లబ్ధిదారులకు కిలో రూ.10 వంతున చెల్లిస్తూ ఆ బియ్యాన్ని నిల్వ ఉంచుకుని తమకు అనుకూల సమయంలో వాటిని మళ్లించి అక్రమ వ్యాపా రాలు కొనసాగిస్తున్నారు. గతంలో పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు ఎన్నోసార్లు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నా షరా మామూలే అన్న విధంగా వ్యాపారం సాగిస్తున్నారు. ముఖ్యంగా బెంగుళూరు, మద్రాసు, హైదరాబాదు తదితర ప్రాంతాలకు పేయింగ్ గెస్ట్‌హౌస్, మెస్‌లకు రూ.32 వంతున అమ్మకాలు జరుపుతున్నట్లు సమాచారం. అంతేకాక ప్రతి నెలా 1వ తేది నుంచి 15 లోపు ఈ వ్యాపారం చేసేవారు ఈ సంచులను ఏమార్చి ప్యాకింగ్‌లో అనుమానం రాకుండా కొందరు ప్రైవేటు ట్రావెల్స్‌లో, మరికొందరు బస్సుల్లో అమ్మకాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. పోరుమామిళ్ల మండలంలో బియ్యం వ్యాపారాలు చేసేవారు దాదాపు వంద మంది వరకు ఉంటారని అంచనా. గిద్దలూరు, నెల్లూరు జిల్లాల నుంచి కూడా రేషన్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేసి పోరుమామిళ్ల ప్రాంతాల్లో డంప్‌గా చేసి కొందరు వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా కొందరు గ్రామీణ ప్రాంతాల నుంచి మోటరు బైకుల్లో, ఆటోల్లో ధాన్యం సంచుల్లో ఈ బియ్యాన్ని తరలిస్తూ తమ వ్యాపారాన్ని కొనసాగిస్తు న్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా.. బియ్యం అక్రమ వ్యాపారం చేసే వారిపై నిఘా ఉంచామని, అక్రమ రవాణా చేసే వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

పేకాట క్లబ్‌పై దృష్టి సారించాలి

● జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన ఎంపీ సీఎం రమేశ్

జమ్మలమడుగు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రమైన జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయం పక్కన ముద్దనూరు రోడ్డులో నిర్వహిస్తున్న పేకాట క్లబ్‌పై దృష్టి సారించాలని అనకాపల్లి ఎంపీ డాక్టర్ సీఎం రమేశ్ కలెక్టరు శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనధికార పేకాట శిబిరాలు, అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ముద్దనూరు రోడ్డులోని జమ్మలమడుగు క్లబ్‌లో దేవగుడి నాగేశ్వరరెడ్డి అనే వ్యక్తి నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. ఈ క్లబ్‌లో అనధికారికంగా జూదాన్ని ప్రోత్సహిస్తూ మొత్తం 12 టేబుళ్లపై టేబుల్‌కు తొమ్మిది మంది చొప్పున రూ.25 వేలు, రూ.50 వేలు, రూ.లక్ష వరకు పందేలు కాస్తూ లక్షలాది రూపాయల పేకాట శిబిరాలను ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు నిర్విరామంగా నిర్వహిస్తున్నట్లు ఆరోపించారు. జమ్మలమడుగు ప్రాంత ప్రజలే కాకుండా కడప జిల్లాలో సమీప గ్రామాల ప్రజలు కూడా ఈ క్లబ్ ద్వారా పేకాటకు బానిసలుగా మారి తమ సంపాదనను కోల్పోతున్నారని, అంతేకాక మట్కా, లిక్కర్ దందా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని పలువురు స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చారని, కుటుంబాలను నాశనం చేసి మహిళలను ఇబ్బందులకు గురిచేసే ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించరాదని ఫిర్యాదులో పేర్కొన్నారు. సమాజాన్ని కలుషితం చేసే ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలను కఠినంగా అణచివేయాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించదని, కలెక్టర్, ఎస్పీ తక్షణమే స్పందించి జమ్మలమడుగు, కడప జిల్లా పరిసర గ్రామాల్లో పేకాట, మట్కా, కల్తీ లిక్కర్ దందాల నుంచి ప్రజలకు విముక్తి కల్పించాలని కోరారు. అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు సంబంధిత అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

అక్కడంతే..!

● డాక్యుమెంటు రైటర్లదే హవా

● మారని లో ఫీజు దందా

● సస్పెండ్ అయినా మారని తీరు

● అక్రమాలపై అధికారుల ఉదాసీనత

● ఫోర్జరీ గ్యాంగులకు సహకరించిన రైటర్లపై చర్యలేవీ.?



ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అవినీతికి ఆస్కారం లేకుండా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రైవేటు ఆస్తుల రిజిస్ట్రేషన్లను నేరుగా చేయించుకునేలా ప్రభుత్వం ఎన్ని నిబంధనలు పెట్టినా.. అవి ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చెల్లుబాటు కావడం లేదు. ఇప్పటికీ డాక్యుమెంటు రైటర్లదే అక్కడ హవా కొనసాగుతోంది. ఎలాంటి ఆస్తులైనా వారి మధ్యవర్తిత్వం లేకుండా సబ్‌రిజిస్ట్రార్లు సైతం నేరుగా చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

తప్పుడు ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్లు

ప్రొద్దుటూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నిత్యం పదుల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు భారీ స్థాయిలో అవినీతికి పాల్పడి అనేక తప్పుడు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు చేశారు. ఇందులో ఫోర్జరీ గ్యాంగులతో కుమ్మక్కై మరణించిన వారి ఆస్తులకు నకిలీ ఆధార్‌లు సృష్టించి వారి ఆస్తులను వేరే వాళ్లకు రిజిష్టర్లు చేశారు. ఎలాంటి లింకు డాక్యుమెంట్లు లేకున్నా నకిలీ పొజిషన్ సర్టిఫికెట్లతో ఆస్తులను రిజిస్ట్రేషన్ చేశారు. ఇందుకు ఉదాహరణ మాజీ ఎమ్మెల్యే పాణ్యం ఎర్రమునిరెడ్డికి చెందిన ఆస్తి వ్యవహారం. ఈయన ఆస్తిని నకిలీ పొజిషన్ సర్టిఫికెట్లతో రిజిస్ట్రేషన్ చేసిన ఫోర్జరీ గ్యాంగులతో తిరిగి ఆ డాక్యుమెంట్లన్నీ అధికారులు రద్దుచేయించినా.. అక్రమాలకు పాల్పడిన వారిపై ఎలాంటి క్రిమినల్ చర్యలు తీసుకోలేదు. అలాంటి ఫోర్జరీ గ్యాంగులకు సహకరించే డాక్యుమెంటు రైటర్లపైనా చర్యలు తీసుకోలేదు.

సస్పెండ్ అయినా మారని తీరు


గతంలో తాళ్లమాపురం భూముల విషయంలో అక్రమ రిజిస్ట్రేషన్లు చేసినందుకు అప్పటి సబ్‌రిజిస్ట్రార్ రామలక్షుమ్మ సస్పెండ్ అయ్యారు. ఆ తరువాత వచ్చిన అధికారులు కూడా ఇక్కడ భారీ ఎత్తున కమీషన్లు దండుకుని వెళ్లారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడకు కొత్తగా వచ్చిన వారు కొన్ని నిబంధనలు పాటిస్తున్నా.. లోఫీజు విధానం నడిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. డాక్యుమెంటు రైటర్లను కార్యాలయం ఆవరణలో కూర్చోనీయకుండా బయటికి పంపారే కానీ.. వారు కార్యాలయానికి వచ్చి పైరవీలు చేయడాన్ని అడ్డుకోవడం లేదు. ఇందుకు కారణం వారిచ్చే లోఫీజు వసూళ్లేనని ఆరోపణలు ఉన్నాయి.

కోర్టు అటాచ్ మెంటు ఉన్నా..

ప్రొద్దుటూరులో ప్రైవేటు ఆస్తులకు సంబంధించి అనేక కేసులు నడుస్తున్నాయి. కోర్టులలో ఆ ఆస్తులకు సంబంధించి అటాచ్ మెంట్ పెట్టారు. అటువంటి వాటిని కూడా రిజిష్టర్ చేయమని పెద్ద ఎత్తున నగదు ఆశచూపి రాజకీయ ఒత్తిళ్లు కూడా చేస్తున్నారని సమాచారం. అయితే గతంలో ఇక్కడ అధికారులపై నమోదైన కేసుల కారణంగా వాటిని రిజిస్ట్రేషన్ చేయడానికి ఇప్పటి అధికారులు వెనకాడుతున్నారు. అందువల్ల ఇటీవల ప్రొద్దుటూరు, మైదుకూరులో కోర్టు అటాచ్ ఉన్న ఆస్తులను నంద్యాలలో ఎనీవేర్ రిజిష్టర్ కింద చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అలా రిజిస్ట్రేషన్ సబ్‌రిజిస్ట్రార్ సస్పెన్షన్‌కు గురయ్యారు.

సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

కూటమి ప్రభుత్వం వచ్చాక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సీసీ కెమెరాలు అమర్చారు. సబ్ రిజిస్ట్రార్లతో పాటు కార్యాలయ సిబ్బంది ఉన్న చోటు, రికార్డు రూములలో కూడా సీసీ కెమెరాలు అమర్చారు. దీంతో డాక్యుమెంట్ రైటర్లు ఒకప్పటిలా నేరుగా కార్యాలయంలో సిబ్బంది సీట్లలో కూర్చొని పనిచేయడం లేదు. కాకుంటే స్టాంప్ రైటర్లు కార్యాలయంలోకి వచ్చి పనులు చక్కబెడుతున్నారని అంటున్నారు.



అక్రమ రిజిస్ట్రేషన్లు జరగకుండా చర్యలు

ప్రొద్దుటూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్లకు తావు లేకుండా చేస్తున్నాం. కార్యాలయం ఆవరణలో ఉన్న స్టాంప్ రైటర్లను బయటికి పంపాం. కార్యాలయంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ పెట్టాం. ఫోర్జరీ గ్యాంగులకు సహకరించిన డాక్యుమెంటు రైటర్లపై పోలీసులు కేసులు పెట్టకుండా విచారణలకే పరిమితం అయ్యారు. దీంతో వారిపై మేము నేరుగా చర్యలు తీసుకోలేకపోయాం. వారి హవాను బాగా తగ్గించాం. కోర్టు అటాచ్‌మెంటు ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లు చేయలేదు. ఇక్కడ కార్యాలయంలో లోఫీజు లాంటి విధానం ఏదీ లేదు.

- రామదాసు, సబ్ రిజిస్ట్రార్, ప్రొద్దుటూరు

దొరకునా ఇటువంటి సేవ..

● గరుడ వాహనంపై కడపరాయుడు

● రథసప్తమికి సిద్ధమవుతున్న తేరు



కడప కల్చరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): "దొరకునా ఇటువంటి సేవ.. దొరకునా అల్ప తపమొనరించిన భూసురవరులకైన సురలకైన.." అంటూ గరుత్మంతుడు జగద్రక్షకుడు, సచ్చిదానంద స్వరూపుడు అయిన కోనేటిరాయుడి సేవలో తరించాడు. కడప శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఐదవ రోజైన ఆదివారం రాత్రి గరుడ వాహనంపై కడపరాయుడు తన దేవేరులతో కొలువుదీరి దేవునికడప మాడవీధుల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామివారి ఉత్సవం ముందు కోలాటం, చెక్కభజనలు చేశారు. అలాగే కేరళ వాయిద్య కళాకారుల ప్రదర్శన భక్తులను అలరించింది. అంతకుముందు ఉదయం దేవదేవుడు ముత్యపు పందిరి వాహనంపై మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌సేవ, టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు వారు కీర్తనలు ఆలపించారు. కాగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 4న మంగళవారం జరగనున్న రథసప్తమి వేడుకలకు ఆలయ తేరును సిద్ధం చేస్తున్నారు. కార్యక్రమంలో దేవునికడప ఆలయ ఇన్‌స్పెక్టరు ఈశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్



అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించవద్దు

● ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

చెన్నూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పోలీసులంటే ప్రజలకు గౌరవం ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించవద్దని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అన్నారు. చెన్నూరు పోలీసుస్టేషన్‌ను ఆదివారం సందర్శించిన ఆయన అక్కడి రికార్డులను, పెండింగులో ఉన్న కేసులను పరిశీలించారు. అలాగే సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. అంతేకాక మండల వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించరాదని, మట్కా, గ్యాంబ్లింగ్, ఇసుక అక్రమ రవాణా, ఎర్రచందనం, ఈవ్‌టీజింగ్, దొంగతనాలు లాంటి వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండాలని, సమస్యలను తెలిపేందుకు వచ్చే ప్రజలను గౌరవపూర్వకంగా చూడాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించే ప్రసక్తి లేదన్నారు. అలాగే మహారాష్ట్రలోని ధార్ జిల్లా ప్రాంతం నుంచి ఓగ్యాంగ్ వచ్చిందని, వారు ఊరి చివర ఇళ్లను టార్గెట్ చేస్తారని పార్కింగ్ చేసిన వాహనాలు దొంగతనం చేయడం, ఒంటరిగా ఉన్న ఇళ్లను దోచుకోవడం చేస్తారని, అప్రమత్తంగా ఉండాలన్నారు. హైవే రహదారిలో నిరంతరం పెట్రోలింగ్ ఉండాలని, ప్రమాదాల నివారణకు గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సీఐ పురుషోత్తంరాజు, ఎస్‌బీ సీఐ భాస్కరరెడ్డి, సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. అదేవిధంగా ప్రొద్దుటూరు డీఎస్పీ కార్యాలయాన్ని, యర్రగుంట్ల పోలీసు స్టేషన్‌ను సందర్శించి పలు సూచనలు చేశారు.

క్యూఆర్ కోడ్ ద్వారా సులభతరమైన చెల్లింపులు

● విద్యుత్‌శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు వినియోగదారులు వ్యయ ప్రయాసలకు గురికాకుండా సులభతరంగా, సమర్థవంతంగా క్యూఆర్ కోడ్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్.రమణ అన్నారు. ఈ మేరకు ఆదివారం కడపలోని నెహ్రూనగర్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ విద్యుత్ బిల్లులకు సంబంధించి డిమాండ్ నోటీసు కింద భాగంలో క్యూఆర్ కోడ్ ఉంటుందని, ఈ కోడ్‌ను ఫోన్‌పే, గూగుల్ పే, పేటీయం ద్వారా కానీ ఇతర పేమెంట్ యాప్‌ల ద్వారా కానీ స్కాన్ చేస్తే వెంటనే ఆ బిల్లుకు సంబంధించి అదే అమౌంటు చూపించడంతో పాటు 13 అంకెల మీ విద్యుత్ సర్వీసు నెంబరు యాప్‌లో కనిపిస్తుందన్నారు. దీన్ని నిర్ధారణ చేసుకున్న తరువాత చెల్లింపు సులభతరంగా చేయవచ్చని తెలిపారు. విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం ఉండదని, అదేవిధంగా అనధికార వ్యక్తులకు కరెంటు బిల్లుల డబ్బులు ఇచ్చి మోసపోయే అవకాశం ఉండదన్నారు. ఈ క్యూఆర్ కోడ్ నెలనెలా వచ్చే బిల్లుల్లో మారుతూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి



వేముల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.కె.కొట్టాల గ్రామానికి చెందిన సింగంశెట్టి పద్మావతి (50) అనే మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. మృతురాలి భర్త సుబ్బరాయుడు వివరాల మేరకు.. తన భార్య పద్మావతి ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో గేదెలను మేపుకునేందుకు సమీపంలోని కొండలోకి వెళ్లిందని, మధ్యాహ్న సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆ కొండ సమీపంలోని తోటలో మోటార్ స్టార్టర్ చోరీకి రావడంతో అక్కడ ఉన్న ఓ మహిళ గట్టిగా కేకలు వేయడంతో దొంగ కొండ ప్రాంతంలోకి పారిపోయినట్లు గ్రామస్థులు తెలిపారన్నారు. దీంతో తన భార్య కూడా గేదెలు తోలుకుని వెళ్లిందని, ఆమె మెడలో బంగారు గొలుసు, కమ్మలు ఉండడంతో ఎక్కడ ఆమెపై దాడి చేస్తారోనని హుటాహుటిన గ్రామస్తులతో కలిసి తాను కొండ ప్రాంతంలోకి వెళ్లి గాలించామన్నారు. అయితే తన భార్య అప్పటికే కొండ కింద ప్రాంతంలో తీవ్ర గాయాలతో మృతిచెంది ఉందని చెప్పారు. అయితే మృతురాలి మెడ, తలపై గాయాలు ఉన్నట్లు గుర్తించామని, గొలుసు, కమ్మలు, ఉంగరం లేకపోవడంతో ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు మహిళపై దాడి చేసి ఆమె ఒంటిపై ఉన్న నగలను తీసుకెళ్లినట్లు అనుమానం వ్యక్తం చేశారు. అయితే విషయం పోలీసులకు తెలియజేయడంతో సీఐ ఉలసయ్య, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని మృతురాలిని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టి సంఘటన స్థలం నుంచి పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కాగా మృతురాలి దుస్తులు చిందరవందరంగా ఉండడం, బంగారు నగలు చోరీ కావడంతో స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా లూర్దుమాత తిరుణాల ప్రారంభం



కడప కల్చరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మరియాపురం లూర్దు మాత తిరుణాల మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పతాకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నెల్లూరు పీఠాధిపతి ప్రకాశ్ పాల్గొని ప్రసంగించారు. విశ్వాసులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కాగా చర్చి విద్యుత్ కాంతులతో విరాజిల్లింది. ఇందులో భాగంగా ఈ నెల 10, 11 తేదీల వరకు నవదిన ప్రార్థనా కార్యక్రమాలు జరగనున్నట్లు కమిటీ సభ్యులు ప్రదీప్ వెల్లడించారు.

వంక పోరంబోకు స్థలం అమ్మేశారు


ఎకరా రూ. 4 లక్షలు ● మైసూరివారిపల్లెలో బయటపడిన భూ దందా ● ఓ పార్టీలో మొదలైన కుమ్ములాట



వంకపోరంబోకు స్థలంలో బోర్డునాటిన రెవెన్యూశాఖాధికారులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): వంక పోరంబోకు స్థలాన్ని ఏకంగా ఎకరం రూ. 4లక్షలకు అమ్ముకున్నారు. ఆలస్యంగా వెలుగు చూసిన భూ దందాపై విషయం బహిరంగ చర్చకు దారి తీసింది. వైసీపీ ప్రభుత్వంలో మైసూరివారిపల్లె గ్రామస్తులు కలిసి కట్టుగా భూమిని కాపాడుకున్నారు. ఇందులో కొంత స్థలాన్ని ఈద్గాకు కేటాయించారు. అంతేకాకుండా ఈ స్థలంపై కొన్ని నెలలపాటు వివాదం తలెత్తింది. ఫలితంగా వైసీపీతో మైసూరివారి పల్లె ప్రజలు పెద్ద పోరాటం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇదే భూమిపై ఓ పార్టీ నేతలు ముగ్గురు కన్నేశారు. ఎకరా రూ. 4లక్షలు చెప్పున అమ్ముకున్నారని బాహటంగా చెప్పుకుంటున్నారు. వివరాల్లోకెళితే....

రైల్వేకోడూరు మండలం మైసూరివారిపల్లెలో సర్వే నెంబరు 2085లో మొత్తం 17.85 ఎకరాల వంక పోరంబోకు భూమి ఉంది. ఈ భూమి పక్కనే ఉన్న రీగల్ సోప్ పరిశ్రమ కొన్ని కారణాల చేత మూతపడింది. ఈస్థలం ప్రధానదారికి దగ్గరగా ఉండడంతో అందరి దృష్టి ఆ భూమి పైనే పడింది. ఈ పరిశ్రమ భవనాలు, స్థలాన్ని ఒక పారిశ్రామిక వేత్త తీసుకుని కొంత భాగాన్ని గత టీడీపీ ప్రభుత్వంలో కన్వర్షన్ చేయించుకుని అమ్ముకున్నారు. అంతేకాకుండా కాల క్రమేణా కొందరు కబ్జాదారులు ఆక్రమించుకుని మామిడి తోటలు వేసుకుని దర్జాగా అనుభవిస్తున్నారు. మరికొందరు ఇంకొంత ముందుకెళ్లి ఈభూమిని కొంత భాగం ఆన్‌లైన్ చేసుకోవడం, ఈ విషయం బయట పడడంతో అధికారులు మళ్లీ రద్దు చేశారు. అప్పటి నుంచి ఈ భూమి వివాదంలోనే కొనసాగుతోంది. గతంలో సీపీఎం నేతలు, కార్యకర్తలు భూ పోరాటంలో భాగంగా జెండాలు పాతారు. దీంతో అప్పటి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని ఇది ప్రభుత్వ భూమి దీనిని ఎవరూ ఆక్రమించరాదని బోర్డు ఏర్పాటు చేశారు. ఈ భూమిపై కన్నేసిన వారు ఆక్రమణలు చేస్తూనే ఉన్నారు. భూమిని అమ్మేశాం తీసుకున్న వారు ఏమైనా చేసుకోవచ్చని ఖద్దరు బాబులు బహిరంగంగా చెబుతున్నారు. ఇందులో ఓ పార్టీ నేతలు వాటాలు కావాలని వాదోపవాదాలు చేసుకుంటున్నారు. కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ, ఇప్పుడు కూటమి ప్రభుత్వాల్లో ఆక్రమణ ప్రయత్నాలు ముమ్మరం సాగాయి. ప్రస్తుతం ఏకంగా ఓ పార్టీ నేతలు ముగ్గురు వంక పోరంబోకు భూమిని అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



సర్పంచ్ రాసిన వినతి పత్రం



మిగిలింది ఈ స్థలమే

17.85 ఎకరాల్లో మిగిలింది ఐదే...

మైసూరివారిపల్లె వంకపోరంబోకు భూమి 17.85 ఎకరాల్లో ఆక్రమణలు పోగా 5 ఎకరాలే మిగిలింది. కొందరు ఇళ్లు నిర్మించుకున్నారు. కంకర మిషన్ పెట్టుకుని ఒకరు ఆక్రమించుకుని దర్జాగా అనుభవిస్తున్నారు. మరికొందరు మామిడి తోటలను సాగు చేస్తున్నారు. గతంలో కొందరు ప్లాట్లు వేసుకుని విక్రయించారు. ప్రభుత్వ స్థలాలకు రక్షణ లేకుండా పోతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో ఏమి జరిగిందంటే....

చాలా కాలంగా రైల్వేకోడూరులో ముస్లింలకు ఈద్గా సమస్య ఉంది. ఉన్న ఈద్గాలో జనాలు రంజాన్, బక్రీదు తదితర పండుగలకు సరిపోవడం లేదని ముస్లింలు చాలా కాలంగా అడుగుతూ వచ్చారు. పాలకులు కాలయాపన చేశారు. ఎన్నికల సమయంలో ముస్లింల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని గుర్రుమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వంకపోరంబోకు భూమిలో కొంతభాగం ఇవ్వాలని వైసీపీ ప్రభుత్వ పాలకులు నిర్ణయించారు. కట్టడాలు మొదలు పెట్టిన నాటి నుంచి పూర్తి అయ్యే వరకు మైసూరివారిపల్లె ప్రజలు అడ్డుకున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వ పాలకులు పోలీసులను పెట్టించి నిర్మాణాలు చేయించి పూర్తి చేశారు. అందులోనే రంజాన్, బక్రీదు పండుగల రోజున ముస్లింలు అందరూ పలు సార్లు ప్రార్థనలు చేశారు.

ఈద్గా స్థలాన్ని రద్దు చేయాలని ఎమ్మెల్యేకి విన్నపం

వంకపోరంబోకు స్థలంలో ఈద్గాకు కేటాయించిన స్థలాన్ని రద్దు చేయాలని మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త సంతకం చేసిన ఒక లెటర్ బయట పడింది. ఈ లెటర్ వంకపోరంబోకు భూ వివాదాన్ని మరింత తెరపైకి తెచ్చింది. సర్పంచ్‌ని వివరణ కోరగా.... వంకపోరంబోకు స్థలాన్ని పంచాయతీలోకి కలిపి ముందుగా సర్వే చేయించాలని, నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, కమ్యూనిటీ హాలు ఏర్పాటు చేయాలని కోరినట్లు వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. ఈద్గా స్థలాన్ని రద్దు చేయమని తాను వినతిపత్రంలో రాయలేదన్నారు. ఈద్గా స్థలాన్ని రద్దు చేయమని ఎవరు రాశారో తనకు తెలియదన్నారు. ముస్లింలకు తమ గ్రామస్తులు వ్యతిరేకం కాదన్నారు. వారికి కూడా ఈద్గా స్థలాన్ని కేటాయించేందుకు తాను కృషి చేస్తామని తెలిపారు. వంకపోరంబోకు స్థలాన్ని అమ్ముకున్నారనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఒక వేళ అమ్మకాలు జరిగి ఉంటే తాను ఎంత పోరాటానికైనా సిద్ధంగా ఉంటాన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఈ స్థలాన్ని కాపాడుకునేందుకు నిందలు, పోలీసుల బెదిరింపులు, కేసులు గ్రామస్తులు సహా ఎదుర్కొన్నామని గుర్తు చేశారు.



స్థలాన్ని కాపాడాలని రూపానందరెడ్డికి ముస్లింలు ఇస్తున్న వినతి (ఫైల్)

ఈద్గాకు కేటాయింపు రద్దు చేయకండి

ముస్లిం నేతలు కుడాచైర్మన్ ముక్కా రూపానందరెడ్డిని కలిసి ఈద్గాకు కేటాయించిన స్థలాన్ని రద్దు చేస్తారని సమాచారం వచ్చిందని, రద్దు కాకుండా చేయాలని విన్నవించారు. ఈద్గా స్థలం ఎక్కడికీ పోదని మీకు అన్యాయం జరగనివ్వనని ముస్లింలకు ముక్కా రూపానందరెడ్డి, యువ నేత ముక్కా సాయి వికాస్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ముస్లింలు తెలిపారు.

ఆక్రమిస్తే చర్యలు

వంకపోరంబోకు స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు ఉంటాయని రైల్వేకోడూరు తహసీల్దార్ మహబూబ్ చాంద్ తెలిపారు. వంకపోరంబోకు స్థలంలో ఎలాంటి కట్టడాలు ఉండరాదని, నాలుగెకరాల స్థలానికి కోర్టు స్టే ఇచ్చి ఉందన్నారు. కొన్ని నెలల కిందట ఉన్న ఆక్రమణలు తొలగించామన్నారు. వంకపోరంబోకు స్థలాన్ని అమ్మకం కుదరదని, ఒక వేళ కొన్నా చట్టరీత్యా చర్యలు ఉంటాయని తెలిపారు. వంకపోరంబోకు స్థలాలను పట్టాలు, గృహాలు, కట్టడాలు చేయలేమని, అందుకు అనుమతి రాదని స్పష్టంగా వివరించారు.

ముగ్గురు నిందితులు అరెస్టు

● 11 తులాల బంగారు, ఓమ్నీ కారు స్వాధీనం



నిందితులు, బంగారు ఆభరణాలు చూపుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం అర్బన్ పోలీసు స్టేషన్‌లో సీఐ లింగప్ప ఆధ్వర్యంలో విలేకరులకు డీఎస్పీ నిందితుల వివరాలు తెలుపుతూ అనంతపురం జిల్లా, గుత్తి టౌన్, మారుతీనగర్ వాసులు వనార్చి అనంతమ్మ, వనార్చి మహేష్, వనార్చి గాయత్రి ఒకే డోర్ నంబరులో నివసిస్తున్నారు. జనవరి 30వ తేదీన ఉదయం 11 గంటలకు స్థానిక కెనరా బ్యాంకులో పెద్దదండ్లూరు వాసులు ఇరగంరెడ్డి సావిత్రి, ఆమె భర్త కలిసి నాలుగు తులాల బంగారు ఆభరణాలతో బ్యాంకులో బంగారు తాకట్టుపెట్టి రుణం తెచ్చుకునేందుకు వచ్చారు. ఆమె క్యూలో ఉండగా బ్యాగు కట్ చేసి బంగారు చోరీ చేశారని, వాటి విలువ రూ.2 లక్షలకుపైగా అవుతుందని బాధితురాలు ఫిర్యాదు చేసింది. కెనరా బ్యాంకులో సీసీ పుటేజీ ఆధారంగా అనుమానితుల చిత్రాలను తీసుకుని పోలీసులు విచారణ ప్రారంభించారు. తాడిపత్రి రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఏపీ21.బియు.2685 నంబరు ఓమ్నీ కారులో ముగ్గురు వస్తుడంగా వారిని అనుమానంతో పట్టుకుని స్టేషన్‌కు తెచ్చినట్లు తెలిపారు. విచారణలో పలు ప్రాంతాల్లో చోరీలు చేసినట్లు వారు అంగీకరించారన్నారు. వారి నుంచి 3 బంగారు చైన్లు (7 తులాలు), ఒక బంగారు హారం (2 తులాల), రెండు జతల బంగారు కమ్మలు (ఒకటిన్నర తులం), ఒక జత చెంపసారెలు (అరతులం), ఓమ్నీ కారు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బంగారు విలువ రూ.8.80 లక్షలు అవుతుందని తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. సీఐ లింగప్ప, ఎస్ఐ రామక్రిష్ణ, హెడ్‌కానిస్టేబుల్ దేవదాసు, కానిస్టేబుల్ రియాజ్, నాగేంద్ర, జ్యోతిని ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలి

నోబెల్ ప్రైజ్ సాధించే స్థాయికి ఎదగాలి : వీసీ



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాల్సిన అవసరం ఉందని వైవీయూ వైస్ చాన్సెలర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు నోబెల్ బహుమతి సాధించే స్థాయికి ఎదగాలని సూచించారు. ఆదివారం కడప నగరం మరియాపురం సెయింట్ జోసెఫ్ బాలుర ఉన్నత పాఠశాలలో బాలోత్సవం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని తల్లిదండ్రుల ద్వారా నిర్ణయించుకుంటారన్నారు. విద్యార్థులు చదువుతున్నారే తప్ప నోబెల్ ప్రైజ్ వచ్చేస్థాయిలో కష్టపడకపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. కమిటీ అధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ అందరి సహకారంతో ఇంతటి కార్యక్రమం నిర్వహించారన్నారు. ఎస్‌వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ జగదీశ్వరరెడ్డి, విద్యావేత్త, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు నాగమునిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్, ప్రసంగించారు. కమిటీ ప్రచార కార్యదర్శి శివరాం, కల్చరల్ కన్వీనర్ వెంకటసుబ్బయ్య, అకడమిక్ కన్వీనర్ మహేష్, గోపి, సర్దార్ ఫైజీ మగ్బుల్‌బాష, దేవదత్తం, సుందరయ్య, రామకృష్ణారెడ్డి, బాలయల్లారెడ్డి, ప్రొఫెసర్ మృత్యుంజయరావు, ఉషా తులసి, అరుణ, సరస్వతి, సునీత, వెంకటేశ్వర్లు, స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ జాన్సన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడిన ఆవును కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



బావిలో పడిన ఆవు

పీలేరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పాడుబడిన బావిలో ప్రమాదవశాత్తు పడిపోయిన పాడి ఆవును అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. కావలిపల్లె వాసి దేవి ఆవు స్థానిక నాగూరు రైస్ మిల్లు ప్రాంతంలో తిరుగుతూ ప్రమాదవశాత్తు బావిలో పడిపోయింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి విషయం చేరవేయడంతో రంగంలోకి దిగి దానిని రక్షించారు. సుమారు రూ.70 వేలు విలువైన పాడి ఆవును కాపాడిన అగ్నిమాపక సిబ్బందిని అభినందించారు.

544 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్

ఎదురీదుతున్న హిమాచల్‌ప్రదేశ్



వెంకట రాహుల్(197 పరుగులు) - ప్రసాద్ (107)

కడప స్పోర్ట్స్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కడప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో ఆంధ్ర - హిమాచల్ ప్రదేశ్ జట్ల మధ్య జరుగుతున్న కికెట్ మ్యాచ్ ఆదివా రం ఆంధ్ర జట్టు 8 వికెట్ల నష్టానికి 544 పరుగులు సాధించి డిక్లేర్ చేసింది. కల్నల్ సీకే నా యుడు ట్రోఫీలో భాగంగా అండర్-23 మల్టీడేస్ నాలుగు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 544 పరుగులు సాధించింది. అంతకు ముందు ఓవ ర్ నైట్ స్కోరు 5 వికెట్లనష్టానికి 360 పరుగులతో తిరిగి రెండో రోజు బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు మరో 184 పరుగులు జోడించి మొత్తంగా 135.5 ఓవర్లలో 8 వికెట్లను కోల్పోయి 544 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో ఓవర్ నైట్ స్కోరు 162 పరుగుల నాటౌట్ స్కోరుతో క్రీజ్‌లో ఉన్న వెంకటరాహుల్ ఎట్టకేలకు 197 పరుగులు సాధించి అవుట్ కాగా మరో బ్యాట్స్‌మెన్ ప్రసాద్ 107 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. ఇదిలా ఉండగా 544 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హిమాచల్ ప్రదేశ్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో రెండో రోజు ఆట ముగిసే సమయానికి 45 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 159 పరుగుల చేశారు. ఆంగ్ర 51 పరుగులు చేయగా, యోగ్‌దీప్ ఠాగూర్ 50 పరుగులు చేశారు. దీంతో ఇంకా 385 పరుగుల లోటుతో ఎదురీదుతోంది. సోమవారం మూడోరోజు.

జిల్లా స్థాయి క్విజ్‌లో సంబేపల్లె విద్యార్థుల ప్రతిభ

సంబేపల్లె, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాయచోటి డైట్ కేంద్రంలో డిసెంబరు 21న నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో సంబేపల్లె విద్యార్థులు రుక్సానా, మౌనిక, తరుణ్ కుమార్‌గౌడ్ ప్రథమ స్థానం పొందినట్లు ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం కడప నాగార్జున డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఏకలవ్య ఫౌండేషన్ వార్షికోత్సవ సభలో విద్యార్థులకు మెమెంటో, మెరిట్ సర్టిఫికెట్ అందించినట్లు తెలిపారు. ప్రతిభ చాటిన వీరికి కడప ఎంఈఓ గంగిరెడ్డి, నాగార్జున డిగ్రీ కళాశాల డైరెక్టర్ శివ విష్ణుమోహన్‌రెడ్డి, డీఈఓ కార్యాలయం ఏడీ మునీర్‌ఖాన్, పాఠశాల ఏకలవ్య కోఆర్డినేటర్ రెడ్డిశేఖర్, ఏకలవ్య ఫౌండేషన్ సలహాదారులు గునిపాటి శ్రీనివాసులు, ప్రశాంత్ తదితరులు విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

రూ.2000 కోసం చిరు వ్యాపారి హత్య



పులివెందుల టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అప్పు చెల్లించలేదని తోపుడుబండిపై అరటిపండ్లు అమ్మే వ్యాపారిని హత్య చేశారు. పుల్లారెడ్డి హాస్పిటల్ సమీపంలో నివాసి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం దగ్గర తోపుడుబండిపై అరటిపండ్ల వ్యాపారం చేసుకునే మోహన్ (57) పట్టణానికి చెందిన ఓ అరటికాయల వ్యాపారికి రూ.2వేలు డబ్బు బాకీ ఉన్నాడు. ఆదివారం రాత్రి డబ్బు కావాలని మోహన్‌ను అడగడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. దీంతో మోహన్‌ను కొట్టడంతో అక్కడే నేలకు ఒరిగి పడిపోయాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించే సమయానికి మృతి చెందాడు. దీనిపై సీఐ వెంకటరవణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధురాలి మృతి



సింహాద్రిపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లప్పగారి పార్వతమ్మ(80) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. సింహాద్రిపురం ఎస్ఐ తులసీ నాగప్రసాద్ సమాచారం మేరకు.. మృతురాలు పార్వతమ్మ ఇంటికి కొద్ది రోజులుగా ఇంటి బయట తాళం వేసి ఉండేది. ఆమె ఎక్కడికైనా పోయి వుండవచ్చని స్థానికులు అనుకున్నారు. శనివారం రాత్రి ఇంటి నుంచి దుర్వాసన వెలువడడంతో ఇరుగు పొరుగువారు అనంతపురంలో వున్న మృతురాలు కుమారులకు సమాచారం తెలిపారు. వారు పోలీసుల సమక్షంలో ఇంటి తలుపు తెరవగా పార్వతమ్మ మృతదేహం కుళ్లిపోయి కనిపించింది. ఆమెను హత్యచేసి వుండవచ్చనే కోణంలో, పలుకోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలు కుమారుడు రామాంజులరెడ్డి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆదివారం పులివెందుల సీఐ వెంకటరమణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతికి గల కారణాలపై సీఐ విచారించారు. అనంతరం డాగ్, క్లూస్ టీమ్‌తో పరిశీలించారు. మృతురాలుకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలదు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్థులను విచారిస్తున్న సీఐ వెంకటరమణ

లారీ, బైక్ ఢీ ఒకరికి గాయాలు

సిద్దవటం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కడప - చెన్నై జాతీయ రహదారిపై శనివారం ఆగి ఉన్న లారీని బైక్ చోదకుడు ఢీకొట్టడంతో బలమైన గాయాలు తగిలాయి. స్థానిక పోలీసు సమాచారం మేరకు వేంపల్లె వాసులు మస్తాన్, బాబాఫక్రుద్దీన్ రేణిగుంట నారాయణ పాఠశాలలో చదువుతున్న మస్తాన్ పిల్లలకు ఫీజు కట్టి వేంపల్లెకు వస్తున్నారు. ద్విచక్ర వాహనం కడప - చెన్నై జాతీయ రహదారి కనుమలోపల్లె వద్ద ఆగి ఉన్న లారీని శనివారం రాత్రి 11.30 గంటలకు ఢీకొంది. దీంతో మస్తాన్ తలకు, ముఖానికి బలమైన గాయాలు తగిలాయి. గాయపడిన వ్యక్తిని హైవే పెట్రోలింగ్ పోలీసులు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. జరిగిన ఘటనపై స్థానిక పోలీసులు విచారిస్తున్నారు.

'ఫీజుపోరు'కు అనుమతి కోరిన వైసీపీ నేతలు

కడప క్రైం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కడప నగరం జిల్లా పోలీసు కార్యాలయంలో వైసీపీ పిలుపు మేరకు ఈ నెల 5న ఫీజుపోరు కార్యక్రమానికి అనుమతి కోరుతూ ఎస్పీ అశోక్‌కుమార్‌ను ఆదివారం మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాధరెడ్డి, కడప నగర మేయరు కె.సురేశ్‌బాబు కలిశారు. కార్పొరేటర్లు మల్లికార్జున, కిరణ్, మహ్మద్‌షఫీ, మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు దాస రి శివప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట క్రిష్ణ, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి షఫీ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

లింగాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండంలోని చిన్నకుడాల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వేంపల్లె మండలం బక్కన్నగారిపల్లె గ్రామానికి చెందిన మదన్‌మోహన్, పెద్దక్కలు అనంతపురం జిల్లా నార్పలకు గృహప్రవేశం నిమిత్తం వెళ్లివస్తుండగా చిన్నకుడాలకు చేరుకోగానే, పెద్ద కుడాలగ్రామానికి చెందిన పఠాన్ కమాల్ అనే వ్యక్తి పులివెందుల నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా చిన్నకుడాలకు చేరుకోగానే ప్రమాదవశాత్తు కారు, ద్విచక్రవాహనం ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి.

బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం

ఏపీసీసీ ప్రతినిధి తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో గతంలో జరిగినట్లే ఈసారి కూడా కడప జిల్లాకు, రాయలసీమకు, రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వేంపల్లె లో కాంగ్రెస్ నేతలు నల్లబ్యాడ్జీలు పెట్టుకుని, నల్లజెండాలతో నిరసన దీక్ష చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్రంలో మోదీ ప్రభుత్వ మనుగడ టీడీపీ మీద ఆధారపడి ఉన్నందున, రాష్ట్రానికి తప్పక న్యాయం జరుగుతుందని అందరూ భావించారన్నారు. విభజన చట్టంలోని 13వ షెడ్యూల్ ప్రకారం కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ నిర్మాణం జరగాలని, కావాల్సిన భూమి, నీరు, విద్యుత్ శక్తి, రవాణా సౌకర్యాలు, ముడిపదార్థాలు జిల్లాలో ఉన్నా నిర్మాణానికి నోచుకోలేదని తెలిపారు. ఈసారి బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేదన్నారు. కడప-రాయచోటి-బెంగుళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైలు మార్గానికి నిధులు మంజూరు, సీమకు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ఊసే లేదన్నారు. దీక్షలో కాంగ్రెస్ నేతలు రామాంజనేయరెడ్డి, ఉత్తన్న, బద్రీనాథ్, వెంకటేశ్, మహబూబ్‌బాష, రవి, వినయ్, ఐచర్ రమణ, సాయిశ్యామ్, దిలీప్, కిరణ్, విజయ్, పాపయ్య పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

కొండాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంప్‌హౌస్ వద్ద రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు ఆదివారం మధ్యాహ్నం గూడ్సు కింద పడడంతో తల, మొండెం వేర్వేరయ్యాయి. మృతుడికి సుమారు 45 ఏళ్లు ఉంటాయి. బ్లూచొక్కా ప్యాంటు ధరించాడు. ఇతను ఏ ప్రాంతీయుడో తెలియాల్సి ఉంది. వివరాలు తెలిస్తే తెలియజేయాలని ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ సునీల్ కుమార్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

ఆశాల అక్రమ బదిలీలు ఆపాలి

- రాజకీయ నాయకులు, అధికారుల వేధింపులు భరించలేం
- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి


మాట్లాడుతున్న గుంటి వేణుగోపాల్

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆశా కార్యకర్తల అక్రమ బదిలీలు, రాజకీయ నాయకుల అధికారుల వేధింపులు ఆపాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం హోచిమన్‌భవన్‌లో ఆదివారం ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో గుంటివేణుగోపాల్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మరియమ్మ, కల్పన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు బదిలీల నిబంధనలు లేవన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అధికారులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని, అలాగే రాజకీయ నాయకులు స్వార్థం కోసం ఆశాలను తొలగించాలని తప్పుడు కంప్లయింట్లు ఇస్తున్నారని ఆరోపించారు. చిరుద్యోగులను వేధించడం సరికాదన్నారు. రాజకీయ నాయకుల మెప్పు కోసం ఆశాలను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం సహించరానిదన్నారు. తక్షణమే అక్రమ బదిలీలు, వేధింపులను ఆపాలని డిమాండ్ చేశారు. అలాగే ఆశాలకు అధికారులు ఇచ్చిన మెమోలను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి అమ్ములు, బాలకుళాయమ్మ, యూనియన్ జిల్లా నాయకులు వరలక్ష్మి, జయమ్మ, కాశీరత్నమ్మ పాల్గొన్నారు.

మేధావుల మౌనం దేశ, రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం


మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మేధావుల మౌనం దేశ, రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగిస్తుందని విజ్ఞాన వేదిక వ్యవస్థాపకుల్లో ఒకరైన డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం కడప నగరం ఎస్టీయూ భవన్‌లో జన వి జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యక్రమంలో బ్రహ్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో, దేశంలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్న తరుణంలో ఆ సమస్యలు ఒకటో, రెండో సంస్థలు పనిచేయడం ద్వారా పరిష్కారం కావని, భావసారూప్యం గల అన్ని సంస్థలు కలిసి పనిచేయాలని తెలిపారు. రాజకీయ పార్టీలు గానీ, సామాజిక సేవా సంస్థలు గాని ఒకే మూసలో పనిచేస్తే ప్రజల్లో నిలబడలేవని, వారికి అర్థమయ్యే పద్ధతిలో, ప్రయోజనం కలిగించే విధానంలో పని చేసినప్పుడే వారి మన్ననలు పొందుతాయ న్నారు. జనవిజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు బి.విశ్వనాథ మాట్లాడుతూ ఒక సంస్థ నిర్మాణం మానవ సంబంధాలతో, స్నేహంతో, నాయకత్వం మీద నమ్మకంతో జరగాలన్నారు. ప్ర తి సంస్థ మూడవతరం నాయకత్వం మీద నమ్మకంతో జరాలన్నారు. ప్రతి సంస్థ మూడవ తరం నాయకత్వ లోపంతో సతమతమవుతోందని, ఈ లోపాన్ని అధిగమించాల్సిన అవసరం ఉందన్నారు. జనవిజ్ఞాన వేదిక నాయకుడు కొర్రా సురేష్ బాబు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం మేధావి వర్గం పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి గోపాల్‌నాయక్, జాతీయ ప్రచార కార్యదర్శి సనావుల్లా, రాష్ట్ర కార్యదర్శి గోపాల్‌నాయక్, మైన్స్ శాఖ ఉద్యోగి రాంబాబు, పట్టణ కార్యదర్శి శంకరయ్య, నాగ సుబ్బారెడ్డి, వెంకటశివ, సుధాకర్, ప్రకాష్, శేషారెడ్డి, వెంకటరమణ, గంగాధర్, మహబూబ్ బాష, రాష్ట్ర నాయకులు మంజూరు బాష, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంటుపై మాట్లాడే అర్హత వైసీపీకి లేదు

- టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్


మాట్లాడుతున్న బొజ్జ తిరుమలేశ్

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంటుపై మా ట్లాడే అర్హత వైసీపీకి లేదని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం కడప ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిరుమలేశ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో డిగ్రీ, పీజీ విద్యార్థులను దగా చేసి తాను పెట్టిన బకాయిలపై తానే ఆందోళనకు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలపై వైసీపీ నాయకులు ఆందోళనలకు పిలుపునివ్వడం చూస్తుంటే దొంగే దొంగఅని అరిచాడన్న సామెత గుర్తు చేసుకోవాలన్నారు. రా ష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలు పెట్టింది జగనేనన్న సంగతి గుర్తుంచు కోవాలన్నారు. ఫీజు పోరులో జగన్ ఐదేళ్లలో పెట్టిన బకాయిల కుప్ప గురించి వైసీపీ నాయకులు వివరించాలన్నారు. కళాశాలల ఖాతాల్లో నేరుగా ఫీజులు చెల్లించే విధానాన్ని మార్చి ఓట్ల కోసం తల్లుల ఖాతాలోనికి అంటూ సకాలంలో వేయక బకాయిలు పెట్టి విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న వ్యక్తి జగన్‌రెడ్డి అని ధ్వజమెత్తారు. ప్రజలు ఛీకొట్టినా సిగ్గులేకుండా దుష్ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి హమీద్, జిల్లానాయకులు అమృత్, బిల్లా నవీన్, హరి, సుమంత్, ఆసిఫ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అకౌంట్ నుంచి రూ.61వేలు అపహరణ

వేంపల్లె, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం సెంటర్‌లో కార్డు ద్వారా నెంబర్ మార్చుకొని డబ్బు తీసుకునేందుకు వచ్చిన ఓ వ్యక్తిని గుర్తుతెలియని దొంగ ఏమార్చి అతనివద్దనున్న కార్డు మార్చేసి మాయమాటలతో ఏటీఎం నుంచి అకౌంట్‌లో రూ.61వేలు అపహరించాడు. బాధితుడు ఆలస్యంగా గుర్తించి బ్యాంకులోను, పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేంపల్లెలో నివాసం ఉంటూ గండి దేవస్థానంలో ఉద్యోగిగా పనిచేస్తున్న దేరంగుల ఉత్తన్న అకౌంట్ నుంచి ఈ డబ్బును దొంగలించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. జనవరి 30వ తేదీ గురువారం సాయంత్రం 5గంటల ప్రాంతంలో బాధితుడు దేరంగుల ఉత్తన్న ఏటీఎం సెంటర్‌కు వెళ్లాడు. పిన్ మార్చుకునేందుకు ప్రయత్నించగా ఓటీపీ వస్తుందని ఫోన్‌లో చూసుకుంటుండగా పక్కనే ఉన్న గుర్తుతెలియని వ్యక్తి నేను చేయిస్తాను ఇవ్వంటూ ఉత్తన్న ఏటీఎం కార్డును తీసుకొని వేరేకార్డు ఆయన చేతికి ఇచ్చాడు. పనిచేయలేదంటూ చెప్పడంతో ఉత్తన్న ఇంటికి వెళ్లిపోయాడు. తర్వాత రాత్రి ఒకసారి రూ.2000, మరోసారి రూ.9000, ఇంకో రెండు సార్లు రూ.10వేల చొప్పున రూ.31వేలు గుర్తుతెలియని వ్యక్తి ఏటీఎం నుంచి డ్రా చేసుకున్నాడు. మరుసటి రోజు ఉదయం 11గంటల ప్రాంతంలో రూ.30వేలు డ్రా చేసుకున్నాడు. అప్పటికి ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌లను చూసుకొని బబ్యాంకులో ఫిర్యాదు చేశారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ రంగారావుకు తెలియజేశారు. సమాచారం తెలిపేలోపే బాధితుడి అకౌంట్‌లో రూ.61 వేలు దొంగలించాడు. బాధితుడి ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు. కొత్త వ్యక్తులు కార్డు అడిగితే ఇవ్వద్దని ఎస్ఐ సూచించారు.


ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో మారథాన్ నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థులు

ఉత్సాహంగా, ఉల్లాసంగా..

వేంపల్లె, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో 2008 పూర్వ విద్యార్థులు ఆదివారం ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు.మొదటిరోజు అధికారులతో సమావేశమైన విద్యార్థులు రెండవ రోజు ఆదివారం ఆటపాటలతో గడిపారు. క్యాంపస్ సెంట్రల్ లైబ్రరీ సమీపంలో మారథాన్ నిర్వహించారు. ల్యాబ్ కాంప్లెక్స్‌ను పరిశీలించి ఉపాధ్యాయులతోసమావేశమయ్యారు. ఆత్మీయంగా ఒకరినొకరి గురించి తెలుసుకొని చదువుకున్న నాటి జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకొని ఆనందంగా గడిపారు.

పన్ను రాయితీతో వేతన జీవులకు మేలు

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు రూ.12లక్షల వరకు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వడం వారికి సాంత్వన కలిగించే విషయమని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బడ్జెట్‌పై ఉద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకొని ఉండగా పన్ను రాయితీ ప్రకటన వల్ల వారికి ఎంతో ఉపశమనం లభించిందన్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, ఇతర వ్యయాలకు తోడు వేతనంలో అధికభాగం పన్ను రూపంలో వారు చెల్లిస్తున్నారని అయితే ప్ర స్తుతం రూ.12లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం ఉద్యోగులకు ఊరట నిస్తోందన్నా రు.

'చలో హైదరాబాద్'కు తరలిరావాలి

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాదులో తలపెట్టిన 'చలో హైదరాబాద్' సభకు తరలి రావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ మాదిగ తెలిపారు.ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందక్రిష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆదివారం కమలాపురం పట్టణం గిడ్డంగివీధిలో ఈ నెల 7న హైదరాబాదులో జరిగే లక్ష డప్పులు వేల గొంతుకలు అనే కార్యక్రమం విజయవంతం చేసేందుకు వాల్ పోస్టరును విడుదల చేశారు.

ఘనంగా వసంత పంచమి

కడప క్రైం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆదివారం కడప ఆవోపా మహిళా విభాగ్ వారు స్థానిక సరస్వతి బాల శిశు మందిరంలో ఉన్న సరస్వతీదేవికి పూజ చేసి అక్కడ ఉన్న పిల్లలకు స్కూలు బ్యాగ్స్, పలకలు, క్రైయోన్స్, వాటర్ బాటిల్స్, బిస్కెట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. దాతలు వంకదారి చంద్రశేఖర్, బొగ్గరపు బాలక్రిష్ణ, శివవరప్రసాద్‌కు సన్మానం చేశారు.

'పులివెందులకు నీళ్లిచ్చింది టీడీపీనే'


మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క పని కూడా పూర్తి చేయలేదని, పులివెందులకు నీళ్లు ఇచ్చిన చరిత్ర టీడీపీదేనని మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ తూగుట్ల మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో మట్కాను నిషేధించి, ఉచిత ఇసుక, మైనింగ్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశామన్నారు. పులివెందుల ప్రాంతానికి నీటి సమస్య లేకుండా సస్యశ్యామలం చేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనన్నారు. సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు అంకులరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నీటి విడుదలకు మార్గం సుగమం

లింగాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌పార్మర్లను సిద్ధం చేసి ఎత్తిపోతల ద్వారా నీటిని విడుదల చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గత ఏడాది సెప్టెంబర్ నెలలో లింగాల కుడికాల్వ 22వ కిలోమీటర్ వద్ద కోన చెరువు దగ్గర రెండు ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లను దొంగలు ధ్వంసం చేసి కాపర్ వైర్, ఆయిల్‌ను దొంగిలించిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు ఆదివారం ట్రన్స్‌పార్మర్‌లను అమర్చే ప్రక్రియను అధికారులు ప్రారంభించారు.

తెలుగు మాధ్యమాన్ని కూడా కొనసాగించాలి

- ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి


మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో ఆంగ్లమాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలని అందుకు అవసరమైన అదనపు టీచర్ పోస్టులను మంజూరు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆ దివారం కడప నగరం ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన ఏపీటీఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 40 మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలను ఆదర్శప్రాథమిక పాఠశాలలుగా మార్చాలని, ప్రతి ఆదర్శ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడి పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. టీచర్ల ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. పంఎడింగ్‌లో ఉన్న రెండు డీఏలను ప్రకటించాలన్నారు. 12వ పీఆర్సీ కమిషనర్‌ను నియమించాలని, పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాష, శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శులు మునివర్ధన్‌కుమార్, శ్రీనివాసులు,జిల్లా కౌన్సిలర్లు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రారంభమైన వేదగాయత్రి ప్రతిష్ఠ కార్యక్రమాలు


108కలశాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న ట్రస్టు సభ్యులు

వల్లూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వల్లూరులో ఉన్న వేద గాయత్రి ప్రతిష్ఠ మహోత్సవాలను గాయత్రి పరివార్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నుంచి వైభవంగా ప్రారంభించారు. ఆదివారం సాయంత్రం స్థానిక కోదండరామాలయం వద్ద 108 కలశాలు, మేళతాళాలు, కోలాటాలతో పురవీధుల గుండా మహిళలు, పురుషులు కలశాలను ఎత్తుకుని వేదమాత గాయత్రి మాత వద్దకు తీసుకెళ్లారు. ముందుగా కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలశాలను ఎత్తుకుని గాయత్రి మాతకు జై అంటూ యజ్ఞశాల వద్దకు తీసుకుని వెళ్లారు. అంతకు ముందు ఆదివారం ఉదయాన్నే దేవస్థానం వద్ద గణపతి పూజ, ప్రతిష్ఠ సంకల్పం, ప్రధాన కలశ స్థాపన చేశారు. అనంతరం నవగ్రహ మంటపారాధన, గణపతి, నవగ్రహ హోమం నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు పురవీధులు గుండా కలశ పూజ నిర్వహించి యజ్ఞశాలకు ప్రవేశించారు. సాయంత్రం 6కు దీప యజ్ఞం, తీర్థ ప్రసాదాలు అందించి మహాప్రసాదం అందించారు. అలాగే నేడు ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని గాయత్రి దేవి పరివార్ సంస్థ సభ్యులు కొండారెడ్డి తెలిపారు. అనంతరం భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాద కార్యక్రమం ఉంటుందన్నారు.

కడప ఉక్కుకు అన్యాయం: డీవైఎఫ్ఐ

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో కడప ఉక్కుకు తీరని అన్యాయం జరిగిందని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. ఆదివారం కడప ఉక్కుకు నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి బడ్జెట్‌లో కడప ఉక్కుకు అన్యాయం చేస్తూనే ఉందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విభజన హామీలు కానీ, కడప ఉక్కు కానీ ఊసే లేదన్నారు. ఇది ఇక్కడి ప్రజలను మోసం చేయడమే అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలలో అయినా రాష్ట్ర ఎంపీలు రాష్ట్రానికి, రాయలసీమకు జరుగుతున్న అన్యాయాన్ని తెలియజేసి కేంద్రాన్ని నిలదీసి నిధులు రాబట్టాలని, లేకుంటే చరిత్ర హీనులుగా మిగిలిపోతారన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు రెబ్బ, నరసింహులు, నగర కార్యదర్శి విజయ్, నాయకులు సురేష్, రాజు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కంచెకు నిప్పంటించడంతో చీనీచెట్లు దగ్ధం


కాలిపోయిన చీనీచెట్ల వద్ద చర్మాల గౌస్

చక్రాయపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేట సమీపంలోని చర్మాల గౌస్‌కు చెందిన కంచెకు ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో 60 చీనీ చెట్లు, డ్రిప్‌పైపులు, 20 పైపులు, స్టార్టర్, కంచె పూర్తిగా కాలిపోయాయని చర్మాల గౌస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చీనీ చెట్లకు నిప్పంటించడంతో దాదాపు రూ.1.50లక్షల నష్టం వచ్చిందన్నారు. ఎస్ఐ కృష్ణయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించారని బాధితులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- ఆడపిల్లలకు అండగా లక్ష ఆర్థికసాయం


లింగాలలోని ఉన్నత పాఠశాలలో 1997-98 పూర్వ విద్యార్థులు

లింగాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): 10వ తరగతి 1997-98 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం లింగాలలోని ఉన్నత పాఠశాలలో జరిగింది. తమ బ్యాచ్ విద్యార్థి అయిన గురుప్రసాద్ అనారోగ్యంతో అకాలమరణం పొందడంతో అతని ముగ్గురు కుమార్తెలకు అండగా పూర్వపు విద్యార్థులందరు కలిసి లక్ష రూపాయల ఆర్థికసాయం అందించారు. అలాగే చదువుకున్న పాఠశాలకు గుర్తుగా వాటర్ ప్యూరిఫైర్ వితరణగా అందించారు. విశ్రాంత ఉపాధ్యాయులు రామసుబ్బారెడ్డి, లక్ష్మీకాంతమ్మ, కృష్ణమూర్తి,నారాయణమ్మ, ఉపాధ్యాయురాలు భారతీలను సన్మానించారు. లింగాల ఉన్నత పాఠశాలలో పీఈటీగా పనిచేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి పాఠశాలకు బీరువాను వితరణగా అందించారు. ఈ సందర్భంగా చదువుకున్న సమయంలోని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కార్యక్రమాన్ని ఉత్సాహంగా జరుపుకొన్నారు.

వేమన పద్యాలలోని జ్ఞానం ఆవశ్యకతపై ప్రచారం

పెండ్లిమర్రి ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): వేమన పద్యాలలోని జ్ఞానం ఆవశ్యకతపై ఆదివారం కొత్తసంగటిపల్లె, వెల్లటూరు, పెండ్లిమర్రి గ్రామాలలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు వరుణ్‌కుమార్ మాట్లాడుతూ త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన నిగూఢ తత్వార్థ బోధిని అనే గ్రంథంలో 110 పద్యాలకు ఆధ్యాత్మిక వివరం రాశారని, తెలిపారు.

ఐదుగురు జూదరులు అరెస్టు

వేంపల్లె, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె ఎస్సీ కాలనీ సమీపంలో జూదమాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.12500 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

'ఏపీకి అన్ని విధాలా కేంద్రం సాయం'


మాట్లాడుతున్న శశిభూషణ్‌రెడ్డి

పులివెందుల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు రాజకీయాలు చేయాలని ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పులివెందులలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ముఖ్యంగా వేంపల్లె, వేముల, పెండ్లిమర్రి మండలాల్లో వేల కోట్ల రూపాయల ముగ్గురాయిని కొల్లగొడుతూ వారి ఆర్థిక సామ్రాజ్యాలు నెలకొల్పుకుంటున్నారన్నారు. వేముల మండలానికి చెందిన ఒక వ్యక్తి రూ.200కోట్ల ముగ్గురాయి ఖనిజాన్ని దోచుకొని ఆర్థిక సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నాడన్నారు. మైనింగ్‌లోకి చొరబడి ఖరీదైన రూ.200 కోట్ల ఖనిజాన్ని దోచుకున్న వ్యక్తిపై స మగ్ర విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేముల మండల నాయకులు అదేవిధానాన్ని పాటిస్తూ కోట్లు కొల్లగొట్టాలని ప్రయత్నంలో శాంతిభద్రతలకు విఘా తం కలిగిస్తూ కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తున్నారన్నారు. ఏపీకి కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం జరిగిందని ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్నారని ఆంధ్రజ్యోతి అడిగిన ప్రశ్నకు శశిభూషణ్‌రెడ్డి సమాధానమిస్తూ ఇప్పటికే పోలవరం, రాజధాని అమరావతి, రైల్వేజోన్‌కు నిధులు సమకూర్చిందన్నారు. బీజేపీ రాష్ట్ర సాంస్కృతిక శాఖ కన్వీనర్ భానుప్రకాష్, అసెంబ్లీ కన్వీన ర్ తేరా మహేశ్వర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేత చంద్రమోహన్‌రెడ్డి, పులివెందుల మండల అధ్యక్షుడు వైనవీన్, విష్ణు, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

బాలోత్సవంలో ప్రథమ బహుమతి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మరియాపురం సెయింట్ జోసెఫ్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న బాల ఉత్సవంలో భాగంగా సీనియర్ దేశభక్తి గీతాల పోటీలో కడప ప్రభుత్వ అందుల పాఠశాల విద్యార్థిని నజియా తబుసం ప్రథమ బహుమతి సాధించిందన్నారు. ఈ విద్యార్థినికి టీడీపీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి, వైవీయు వీసీ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి బహుమతిని అందజేశారు. అంధుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎబినేజర్, హెడ్ టీచర్ రమణ పాల్గొన్నారు.

కనులపండువగా మాంగల్య పూజ

కడప కల్చరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆకులవీధిలో వెలసిన రాజరాజేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం సాయంత్రం ఆలయ ప్రధాన అర్చకుడు పిడతల గోపాలక్రిష్ణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి మాంగల్య పూజ కార్యక్రమం నిర్వహించారు. పూజా కార్యక్రమానికి సుమారు 200 మంది మహిళ భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయం తరపున గంధం, పసుపు, కుంకుమ తదితర పూజాద్రవ్యములు అందించారు.

రేపు రథసప్తమి వేడుకలు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో నారాపురం వేంకటేశ్వరస్వామి దేవాలయంలో టీటీడీ శ్రీవారిసేవా సమితి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు రథసప్తమి పర్వదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఇన్‌స్పెక్టర్ మోహన్, శ్రీవారిసేవా సమితి అధ్యక్షుడు సుధాకర్‌గుప్త తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. టేకు రథోత్సవం, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి మహోత్సవ కార్యక్రమం వైభవంగా జరుగును. గర్భగుడి ప్రాకార మహోత్సవం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి సేవా సమితి కార్యదర్శి వెంకటకృష్ణుడు, ట్రెజరర్ గుర్రం శ్రీనివాసులు, కమిటీ సభ్యులు గంగనబోయిన రాధాకృష్ణ, శ్రీనివాసరెడ్డి, సుబ్బలక్షుమ్మ పాల్గొన్నారు.

మసీదును ప్రారంభించిన మాజీ ఎమ్మెల్సీ



నారాయణరెడ్డికి ఖురాన్ పుస్తకం అందజేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో 6వ వార్డులో ఆదివారం ఉదయం మసీదే తౌహిద్‌ను మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా ఆ మసీదు పెద్దలు ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా దేవగుడి నారాయణరెడ్డి హాజరయ్యారు. ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేవగుడి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దైవచింతనలో మంచిగా సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు.మసీదు ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో కమిషనర్ వెంకటరామిరెడ్డి, మసీదు పెద్దలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో రాష్ట్రస్థాయికి కొండాపురం విద్యార్థులు



ఎంపికైన పి.వెంకటహేత్విక్‌రెడ్డి

కొండాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆదివారం కడపలో జరిగిన అబాకస్ పోటీల్లో కొండాపురం వివేకానందస్కూల్‌కు చెందిన 4వతరగతికి చెందిన జ్ఞానదీప్తి, 2వతరగతికి చెందిన దీప్తిక రాష్ట్రస్థాయికి ఎంపిక య్యారు. అదేవిధంగా 5వతరగతికి చెందిన విష్ణువర్దన్ రెడ్డి, నాలుగో తరగతికి చెందిన పి.వెంకటహేత్విక్‌రెడ్డి జిల్లాస్థాయిలో ఎంపికయినట్లు కరస్పాండెంట్ బి.లింగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ పోటీలలో సుమారు 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

చిలమకూరు విద్యార్థి...

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విశ్వం ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేదిక్ మ్యాథ్స్, అబాకస్ జోనల్ లెవెల్ పోటీల్లో చిలమకూరు శ్రీసాయి ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థిని కటారి వీరరోహిణికి జిల్లాస్థాయిలో మొదటి బహుమతి దక్కింది. 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆదివారం కడపలో ఈపోటీలు నిర్వహించినట్లు పాఠశాల కరెస్పాండెంట్ ఎన్.గంగరాజు తెలిపారు.

రెండు వాహనాలు ఢీ - ముగ్గురికి స్వల్ప గాయాలు

ఖాజీపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని పత్తూరు హైవే వద్ద కారు, లారీ ఢీకొని ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు ప్రొద్దుటూరుకు చెందిన శివప్రసాద్ పుష్పగిరికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ప్రొద్దుటూరు వెళుతుండగా కడప నుంచి మైదుకూరు వెళుతున్న లారీ రెండు పక్కపక్కన ఢీకొనడంతో శివప్రసాద్ కుటుంబ సభ్యులకు స్వల్ప గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం 108 ద్వారా రిమ్స్‌కు తరలించారు.

వరుస దొంగతనాలతో భయాందోళనలో ప్రజలు

● నెలలోపు మూడు దొంగతనాలు ● పోలీసులకు కునుకు లేకుండా చేస్తున్న దొంగలు

ఖాజీపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల్లో ఖాజీపేట మండల పరిధిలో వరుస దొంగతనాలు జరిగాయి. దీంతో ప్రజలు, పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా ఉంది. హైవే పక్కనగల దుంపలగట్టులో మండలానికి చివరి గ్రామమైన సన్నపల్లెలో, హైవేపై గల భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో దొంగతనాలు జరిగాయి. అవే కాక రైతుల బోరుబావులకు ఉన్న విద్యుత్తు వైర్లు చోరీకి గురయ్యాయి. ఇలా చెప్పుకుంటూ పోతే మరెన్నో... మండల పరిధిలోని దుంపలగట్టులో డిసెంబరు 18వ తేదీన రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి ఇంట్లోలో చోరీ జరిగి 148 గ్రాముల బంగారం, రూ.4 లక్షలు నగదు, ఇండ్ల సుబ్బారెడ్డి ఇంట్లోలో 20 గ్రాములు బంగారు, రూ.20 వేలు నగదుతోపాటు జనవరి 26 తేదీన హైవేలోగల శ్రీ భీమలింగేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగింది. 27వ తేదీన సన్నపల్లెలో తుమ్మలూరు రవీంద్రారెడ్డి ఇంటిలో 130 గ్రాముల బంగారం, రూ.1.50 లక్షలు నగదు అపహరణకు గురైంది. దీంతో ఇటు పోలీసులకు, అటు ప్రజలకు దొంగలు నిద్రలేకుండా చేస్తున్నారు. ఇప్పటికీపోలీసులు రికవరీ చేయకపోవడంతో రేపు ఏ గ్రామంలో జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలుగజేసుకుని రికవరీ చేసి బాధితులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

● **కేబుల్ దొంగలను పట్టుకున్న పోలీసులు**

రైతుల బోరు బావుల వద్ద కేబుల్ వైర్లు చోరీకి పాల్పడుతున్న నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 780 కేజీల వైరు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. అయినా అక్కడక్కడ మళ్లీ కేబుల్ దొంగతనాలు జరుగుతున్నాయి. ఏది ఏమైనా పోలీసులకు దొంగలు ముప్పుతిప్పలు పెడుతున్నారు.



దుంపలగట్టులో సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ మోహన్ (ఫైల్‌ఫొటో), చిందరవందరగా ఉన్న దుస్తులు

● **త్వరలో నిందితులను పట్టుకుంటాం**

దొంగతనాలకు పాల్పతున్న వారిని త్వరలో పట్టుకుంటామని సీఐ మోహన్ అన్నారు. సీఐ మోహన్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా టెక్నికల్, సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగల కోసం గాలింపు చేపడుతున్నామని, గ్రామాల్లో ప్రజలు నిద్రించే సమయంలో వారి విలువైన వస్తువులను వారి రూములోనే భద్రపరచుకోవాలన్నారు. మొదటి అంతస్థులో బంగారు నగలు పెట్టి రెండో అంతస్తులో నిద్రించరాదన్నారు. రోజు ఒక్కో పంచాయతీలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, కొద్దిరోజులుగా తాళం వేసిన గృహాలను గుర్తించి యజమానులకు ఫోన్ చేసి మీ విలువైన వస్తువులు ఇంటిలో ఉంచకండి అని అవగాహన కల్పిస్తున్నామన్నారు.

పాత నేరస్థులను విచారిస్తూ రాత్రివేళల్లో మరింత గస్తీ పెంచామని, ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. వేసవి సెలవుల్లో తమ సొంత గ్రామాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

చిన్నారుల సంరక్షణే లక్ష్యం

● వి.అరుణకుమారి, ఐసీడీఎస్, సీడీపీవో



ముఖాముఖి

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, గర్భిణీలు, బాలింతల సంరక్షణే లక్ష్యంగా అంగన్వాడీ కేంద్రాల నిర్వహణను సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటున్నాం. పేద పిల్లలు, మహిళలకు ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవడానికి ఈ సెంటర్లు ఎంతగానో దోహదపడుతాయంటున్న ప్రొద్దుటూరు రూరల్ ఐసీడీఎస్ సీడీపీవో వి.అరుణకుమారితో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్రశ్న: ప్రాజెక్టు సంక్షిప్త సమాచారం తెలుపండి.

జవాబు: తమ పరిధిలో ప్రొద్దుటూరు మండలం, రాజుపాళెం మండలాలు ఉన్నాయి. వీటిలో 135 కేంద్రాల్లో 8,821 మంది పిల్లలు ఉన్నారు.

ప్రశ్న: సూపర్‌వైజర్లు, టీచర్లు, సిబ్బంది ఎంత మంది ఉన్నారు.

జవాబు: ప్రొద్దుటూరు మండల పరిధిలో ముగ్గురు, రాజుపాళెం మండలంలో ఇద్దరు సూపర్‌వైజర్లు ఉన్నారు. 133 మంది అంగన్వాడీ టీచర్లు, 133 మంది కార్యకర్తలు, 120 మంది ఆయాలు సెంటర్లలో విధులు నిర్వహిస్తున్నారు.

ప్రశ్న: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఎంత మంది?

జవాబు: 0-6 నెలల వయస్సుగలవారు 783, 6 నెలలు - 3 సంవత్సరాలలోపు పిల్లలు (టీహెచ్‌ఆర్) 4,203, 3-6 సంవత్సరాలలోపు పిల్లలు (ప్రీస్కూల్ విద్యార్థులు) 3,835 మంది ఉన్నారు. గర్భిణులు 832 , బాలింతలు 818 మంది సేవలు పొందుతున్నారు.

ప్రశ్న: అద్దె భవనాలు ఎన్ని ఉన్నాయి.

జవాబు: ప్రొద్దుటూరు మండలంలో 54 సొంత భవనాలు, 33 కేంద్రాలను అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నాం. రాజుపాళెం మండలంలో 38 సొంత భవనాలు ఉండగా 10 భవనాలు అద్దెకు తీసుకుని నడుపుతున్నాం.

ప్రశ్న: నిర్మాణ, అసంపూర్తి భవన వివరాలు ఏమిటి?

జవాబు: ప్రొద్దుటూరు మండల పరిధిలో ఖాదర్‌బాద్, సోములవారిపల్లె, మూలవారిపల్లె, రాజుపాళెం మండలంలో కొర్రపాడు, వెలువలి, టంగుటూరు, దద్దనాల, గాదెగూడూరు, అర్కటవేములలో భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

ప్రశ్న: ఎన్ని పోషక వాటికలు ఉన్నాయి.

జవాబు: రెండు విడతల్లో మొత్తం 60 పోషక వాటికలు మంజూరయ్యాయి. వీటిలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, తదితర 12 రకాల మొక్కలు సాగులో ఉన్నాయి. సాగైన కూరగాయలను ఆహారంగా పిల్లలకు వండి పెడుతున్నాం.

నజరుల్లాషా ట్రస్టు ఆస్తుల అభివృద్ధికి సహకరిస్తాం

● ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, టీడీపీ రాష్ట్ర నాయకుడు సీఎం సురేశ్‌నాయుడు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు రోడ్డులోని నజరుల్లాషా సాహెబ్ ట్రస్టు ఆస్తుల అభివృద్ధికి సహకరిస్తామని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నజరుల్లాషా సాహెబ్‌ట్రస్టు ప్రాపర్టీ అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నజరుల్లాషాసాహెబ్ ప్రజలకు ఉపయోగపడాలని తన ఆస్తులకు సంబంధించి 1944లో వీలునామా రాశాడన్నారు. ట్రస్టు ఆస్తులు ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసుకుని ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని సూచించారు. ట్రస్టు ఆస్తుల పరిరక్షణకు పూర్తిగా సహకరిస్తామని స్పష్టం చేశారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు సీఎం సురేష్‌నాయుడు మాట్లాడుతూ ట్రస్టు స్థలం రక్షణకోసం రూ.10 లక్షలు విలువైన వస్తు సామగ్రిని ఉచితంగా అందజేస్తానని హామీ ఇచ్చారు. మైదుకూరు రోడ్డులోని ఈ స్థలం విలువైందని, దానిని అన్యాక్రాంతం కాకుండా త్వరగా పనులు చేపట్టాలని తమ సహకారం ఎప్పుడు ఉంటుందని పేర్కొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్ మాట్లాడుతూ ట్రస్టు స్థలాన్ని నజరుల్లాషా సాహెబ్ వారసుడు 1986-87లో విక్రయించడాన్ని అడ్డుకున్నామన్నారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 2004లో ముఖ్యమంత్రి అయిన తర్వాత అప్పటి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సహకారంతో కమ్యూనిటీ హాలు నిర్మించామన్నారు. స్థలం కోసం నజరుల్లాషా సాహెబ్ వారసులు కోర్టుకు వెళ్లినా కోర్టు వారికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చిందన్నారు. స్థలం అన్యాక్రాంతం కాకుండా ముందుగా కాంపౌండ్ వాల్ నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ ఖ్వాజీ ఇనాయతుల్లా, న్యాయవాది దాదాపీర్ , బొల్లవరం బాష, ఇక్బాల్, అబ్దుల్లాసాహెబ్, న్యాయవాది జిలానీబాష, జనసేన పార్టీ నాయకుడు జిలాన్, ముస్లింలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి

నేడు సరస్వతీదేవి ఆలయంలో అక్షరాభ్యాసం

కొండాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వసంతపంచమి సందర్భంగా స్థానిక సరస్వతీదేవి ఆలయంలో సోమవారం అక్షరాభ్యాసం నిర్వహించ నున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. అదేవిధంగా అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు విశ్వనాథరెడ్డి తెలిపారు.ఆలయం చుట్టూ గండికోట బ్యాక్‌వాటర్ చేరినప్పటికీ, నీళ్లను మోటార్ల ద్వారా పక్కకు తోడుతూ పూజ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ప్రధాన కార్యదర్శిని కలిసిన పుట్టా



మైదుకూరు రూరల్ ,ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కలిశారు. ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన విజయానంద్‌కు శాలువ కప్పి, పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా వసంతపంచమి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏకల్ అభియాన్ ట్రైబల్ సొసైటీ ద్వారా వసంత పంచమి పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోరుమామిళ్లలోని రామాయపల్లె గ్రామంలో సరస్వతీదేవి విగ్రహం వద్ద పిల్లలకు కడప అంచల్ అధ్యక్ష ఉపాధ్యక్షులు కుర్రా చెన్నయ్య, తిరుపతయ్య, శ్రీనివాసరెడ్డి అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం పుస్తకాలు, పలకాలు పంపిణీ చేశారు.

మైదుకూరుకు చేరిన సమరసత యాత్ర

మైదుకూరు రూరల్ ,ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : విశ్వహిందూ పరిషత్ దక్షిణాంధ్ర సామాజిక సమరసతా యాత్ర స్థానిక వనిపెంట రోడ్డులోని ఈశ్వరీమాత ఆలయం వద్దకు చేరుకొంది.ఈ సందర్భంగా సమావేశంలో హిందూ ధర్మ పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మ యోగానంద్ కృష్ణమాచార్యులు, బీజేపీ నియోజకవర్గ నాయకులు మాచనూరు సుబ్బరాయుడు మాట్లాడారు. , చాగలమర్రి ఆశ్రమం లక్ష్మీపతి బృందం,బండన్న ఆశ్రమం నుంచి శ్రీనివాస్‌రెడ్డి,చింతపర్తి మహేష్,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు - వెయ్యి గొంతులు'కు సిద్ధం కండి



పోరుమామిళ్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): లక్ష డప్పులు-వెయ్యి గొంతుల కార్యక్రమానికి సిద్ధం కావాలని ఎంఈఎఫ్, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఎస్సీ వర్గీకరణను చట్టబద్ధం చేయాలని హైదరాబాదులో జరిగే కార్యక్రమానికి సంఘీభావంగా ర్యాలీ నిర్వహించారు. ఓఎల్ఎఫ్ పాఠశాల నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు డప్పుల మోతతో ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద మానవహారంగా ఏర్పడి డప్పువాయిద్యాలను ప్రదర్శించారు. అనంతరం అంబేడ్కర్ సర్కిల్‌లో విగ్రహానికి పూలమాల వేసి ప్రసంగించారు. ఈ నెల 7న హైదరాబాదు లో లక్ష డప్పులు, వెయ్యి గొంతుల కార్యక్రమానికి గ్రామం నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఈ కార్యక్రమం లో శోభన్‌కుమార్, ఈశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజా, ఎంఈఎఫ్ నాయకులు రవీంద్ర, బాల జోజి, ఓబుయ్య, కమలాపురం ప్రసాద్, ఇన్న య్య, పాపయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులతో పాటు పోరుమామిళ్ల, కలసపాడు, కాశి నాయన, బికోడూరు మండలాల ఎమ్మార్పీ ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

మైదుకూరు రూరల్ ,ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : వనిపెంట సమీపంలోని నల్లమల అడవుల్లో అక్రమరవాణాకు ఉంచి న మూడు ఎర్రచందనం దుంగలు, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసు కొన్నట్లు వనిపెంట అటవీశాఖ రేంజర్ ప్రణీత్ రావు ఆదివారం విలేకరుల సమావేశంలో తెలిపా రు.నల్లమల అడవుల్లో కూంబింగ్ నిర్వహి స్తుండగా కొంత మంది అక్రమ రవాణాకు ఎర్రచందనం దుంగలను నరుకు తుండగా వారి పట్టుకోవడానికి ప్రయత్నించగా వారిలో ముగ్గురిని అదుపులోకి తీసుకొన్నామని మిగిలిన వారు పారిపోయారని తెలిపారు. అదుపులోని నిందితుల వివరాలు గోప్యంగా ఉంచుతున్నట్లు ఆయన తెలిపారు. కూంబింగ్‌లోడీఆర్వో అన్సర్ హుస్సేన్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

ప్రొద్దుటూరు,ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణం టూటౌన్ పోలీసు స్టేషనుకు కూతవేటు దూరంలో వున్న వాజ్‌పేయినగర్‌లో ఆదివారం జూదం ఆడుతున్న 10 మందిని అరెస్టు చేసినట్లు సీఐ యుగంధర్ తెలిపారు. వీరి వద నుంచి 15,900 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వాటర్‌ప్లాంటుకు మరమ్మతు చేయండి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరువెంగలాపురంలో ఉండే వాటర్ ప్లాంటును ఆ ప్రాంత ప్రజలకు ఉపయోగపడేలా మరమ్మతులు చేసి తాగునీరదించాలని హ్యూమన్‌రైట్స్ నాయకులు ముత్యాల ప్రసాద్ అన్నారు. ఆ గ్రామంలో ఐదు లక్షల వ్యయంతో రెండు గ్రామాల ప్రజలకు నీరందించాలన్న ఉద్దేశ్యంతో వాటర్‌ప్లాంటు ఏర్పాటు చేశారన్నారు. కానీ అది ఉపయోగంలో లేకుండా పోయిందని, దాన్ని బాగు చేసి ప్రజలకు మినరల్ వాటర్ అందించాలన్నారు.

ఏవీఎస్ జిల్లా అధ్యక్షుడిగా ప్రహ్లాద్

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విద్యార్థిసంఘం జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రహల్లాద్ తెలిపారు. గత నెల 31, ఈ నెల 1వ తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించిన ఆంధ్రవిద్యార్థిసంఘం రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షుడు మల్లవరపు అశోక్‌రెడ్డి తనను నియమించినట్లు తెలిపారు. నియోజకవర్గ కన్వీనర్‌గా పనిచేస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చేసిన పోరాటాలకు ఫలితంగానే జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యానని తెలిపారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అమరావతిని ఫ్రీజోన్ చేసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారికి రాష్ట్ర కేంద్రంలోని ఉద్యోగాల్లో సమాన హక్కు కల్పించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జిల్లా అధ్యక్షులు పెదుళ్లపల్లె ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం బ్రహ్మంగారిమఠం మండలంలో ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభల గోడపత్రాలను ఆవిష్కరించారు. 6, 7, 8, 9 తేదీల్లో శ్రీకాకుళంలో రాష్ట్ర మహాసభలు జరుగుతాయని,జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు టోనీ, ఓబులేసు, హరి, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించాలి



ఖాజీపేటలో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ మోహన్

ఖాజీపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఆటో డ్రైవర్ యూనిఫాం తప్పనిసరిగా ధరించాలని సీఐ మోహన్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఆటోకు పోలీసు నంబరు తప్పనిసరిగా వేయించాలని, నంబరు లేకపోతే డ్రైవర్‌పై చర్యలు తప్పవన్నారు. అంతేకాక ఆటో డ్రైవరా, దొంగ అన్న క్లారిటీ లేకపోవడంతో ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలన్నారు. అలాగే కొత్తగా వ్యక్తులు కనపడితే స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే మహిళలపట్ల ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని వారు అన్నారు.

బ్రహ్మంగారిమఠం..: వాహనదారులు కచ్చితంగా లైసెన్సులు కలిగి ఉండి ప్రభుత్వం వారు రవాణా శాఖ వారు ప్రవేశపెట్టిన నియమ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారులు చూసుకోవాలని బి.మఠం ఎస్ఐ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం బ్రహ్మంగారిమఠం ఐదురోడ్ల కూడలిలో జీపు, ఆటో, ద్విచక్ర వాహనదారులతో యూనిఫాం, లైసెన్సు తప్పనిసరిగా ఉండాలని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.